క్లుప్తంగా

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ



మక్తల్: మండలంలోని మాద్వార్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం గ్రామానికి చెందిన సంకిరమోళ్ల నర్సింహులు విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు. విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేందుకుగానూ 150 ప్లేట్లను అందజేసినట్లు హెచ్ఎం నర్సిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నర్సింహులును గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామాంజనేయులు, బాబు, వార్డు సభ్యురాలు శివలింగమ్మ, రాములు, ఎస్.శంకరప్ప, సవరప్ప, నర్సప్ప, పిడెప్ప, బాలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా నర్సింహ

మద్దూరు: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా మోమినాపూర్‌కు చెందిన గూళ్ల నర్సింహ రెండోసారి ఎన్నికయ్యారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు కొడంగల్ ఇంచార్జీ తిరుపతిరెడ్డి సోమవారం నియామకపత్రం అందజేసినట్లు నర్సింహ తెలిపారు. మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రఘుపతి రెడ్డి, నాయకులు సంజీవ్, రమేశ్‌రెడ్డి, సంజీవ్ రెడ్డి, రఘు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నేడు శంకుస్థాపన

ధన్వాడ: మండలంలోని మందిపల్లి, తండా, కొండ్రోన్‌పల్లి గ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. ఎమ్మెల్యే పర్యటనలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

62వ రోజుకు రిలే దీక్ష

నారాయణపేట రూరల్: కోటకొండను మండలకేంద్ర చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు చేపట్టిన రిలే నిరాహారదీక్ష సోమవారంతో 62వ రోజుకు చేరింది. బీజేపీ దళితమోర్చ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షను మండల సాధన సమితి సభ్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు శ్రీనివాసులు మాట్లాడుతూ కోటకొండను మండలకేంద్రం చేసేవరకు పోరాటం చేస్తామన్నారు. ప్రభుత్వం స్పందించి అన్ని అర్హతలు ఉన్న కోటకొండను మండలంగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో యాదగిరి, ప్రవీణ్, రాజు, చెన్నప్ప, రాములు, బాలస్వామి, అర్జున్, బాలప్ప, హన్మమ్మ, దస్తప్ప, కృష్ణయ్య, వెంకటేశ్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

పంట రుణాలు మాఫీ చేయాలి



దామరగిద్ద : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం పంట రుణాలు మాఫీ చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్యగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం రైతులతో కలిసి స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. రైతుబంధు డబ్బులు హోల్డ్‌లో ఉంచకుండా రైతులకు అందించాలని, కొత్త రుణాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నర్సింహ, సాయిలు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు ప్రారంభం

నారాయణపేట రూరల్ : విల్ టు కెన్ సంస్థ సౌజన్యంతో జిల్లాలోని ఉపాధ్యాయులకు ఆంగ్లభాషపై ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈఓ రవీందర్ మాట్లాడుతూ అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం ప్రారంభమైన నేపథ్యంలో టీచర్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 40రోజులపాటు ఆన్‌లైన్‌లో నిర్వహించనున్న శిక్షణ తరగతులను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కార్మికుడిగా మారి.. చెత్తను సేకరించి



మక్తల్: మండలంలోని సందేమ్‌పాడు సర్పంచ్ కల్పన భర్త కృష్ణ పంచాయతీ కార్మికుడి అవతారమెత్తారు. పంచాయతీ కార్మికులు సమ్మె చేపట్టిన నేపథ్యంలో సోమవారం ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించారు. గ్రామంలో పారిశుధ్యం లోపించకుండా సర్పంచ్ భర్త చెత్తను సేకరించడంపై పలువురు అభినందనలు తెలిపారు.

సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి

- అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో వ్యవహరించాలి
- ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



మక్తల్ మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్: సమష్టి కృషితోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ వనజ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చారు. సంగంబండ గురుకుల పాఠశాల వద్ద విద్యుత్ సరఫరా లేకపోవడంతో తాగునీటి ఎద్దడి ఏర్పడిందని, భవనాలపై ఉన్న విద్యుత్‌వైర్లను తొలగించాలని ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి కోరారు. జింకలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీటీసీ రంగప్ప, కోఆప్షన్ సభ్యుడు ఖతాల్‌హుస్సేన్ సభ దృష్టికి తీసుకొచ్చారు. కర్ని, కాచ్వార్ ఆస్పత్రుల్లో డాక్టర్లు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అంతకుముందు పలు శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం ఎమ్మెల్యే చిట్టెం మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. మండలంలో 78 అంగన్‌వాడీ కేంద్రాలు, 10 మినీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని తెలిపారు. గ్రామాల్లో చేపట్టిన సీసీరోడ్ల పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. 13 పంచాయతీ భవనాల నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ శ్రీధర్, ఎంపీఓ పావని, ఏవో మిథున్ చక్రవర్తి, వైస్‌ఎంపీపీ రామేశ్వరి, సర్పంచ్ దత్తు, తిమ్మప్ప, ఎంపీటీసీలు ఇందిర, తిమ్మప్ప, రంగప్ప, ఆశిరెడ్డి, లత, లక్ష్మి, ప్రతాప్‌రెడ్డి, గడ్డం రమేశ్, రాంలింగప్ప, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాజేశ్వరి, మహేశ్వరి తదితరులు ఉన్నారు.

గ్రామపంచాయతీలకు కొత్తశోభ..

నర్వ: తెలంగాణ వచ్చాక గ్రామపంచాయతీల్లో కొత్త శోభ సంతరించుకున్నదని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎల్లంపల్లి, లక్కర్‌దొడ్డి, రాజుపల్లి గ్రామాల్లో సోమవారం పంచాయతీ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.25లక్షలతో ఒక్కో భవనాన్ని అన్ని హంగులతో నిర్మించిట్లు తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలతో గ్రామాల రూపురేఖలు మారిపోతున్నాయన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో గ్రామాలు అభివృద్ధికి దూరంగా ఉండేవని, బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక ప్రగతి దిశగా పయనిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ జయరాములుశెట్టి, వైస్‌ఎంపీపీ వీణావతి, ఎంపీడీఓ రమేశ్‌కుమార్, ఏఈ మారుతి, సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌చైర్మన్ లక్ష్మన్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు మండ్ల చిన్నయ్య, కిరణ్ ప్రకాశ్‌రెడ్డి, అయ్యప్ప, సర్పంచులు చెన్నయ్య, శివ, చిన్నారెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



మరికల్‌లో ధర్నా చేస్తున్న కార్మికులు



మాగనూర్‌లో ర్యాలీ..

నారాయణపేట రూరల్ : జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయం ఎదుట మధ్యాహ్నభోజన పథకం కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని, గుడ్లకు సంబంధించి చార్జీలను పెంచాలని, జీవోనెం. 8 ప్రకారం రూ.3వేల వేతనం ఇవ్వాలని కోరారు.

మరికల్: మధ్యాహ్న భోజనం పథకానికి సంబంధించిన పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎమ్మార్సీ భవనం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు దత్తు, తిరుపతమ్మ మాట్లాడుతూ జీవో నెం.8 ప్రకారం కొత్త మెనూ సవరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అక్షయపాత్రను విరమించుకోవాలని, కార్మికులకు గుర్తింపుకార్డులు ఇవ్వాలని కోరారు. 8 నెలలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో సత్యమ్మ, రాధమ్మ, భాగ్యమ్మ, అనిత, ఆంజనేయులు, వెంకటేశ్, లక్ష్మమ్మ, నారాయణ పాల్గొన్నారు.

మాగనూర్: మధ్యాహ్నభోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కో- కన్వీనర్ ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీఉన్నపాఠశాల నుంచి సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం ఇంచార్జీ తాహసీల్దార్ అమీర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులకు జీవో నెంబర్ 8 ప్రకారం పెరిగిన వేతనాలకు ఏరియర్స్‌తో కలిపి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా 2022 మార్చిలో ప్రకటించిన రూ. 3వేల గౌరవ వేతనాన్ని వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు భరత్‌కూమార్, ప్రమీల, దేవమ్మ, మైముదా, బాబు, మంగమ్మ, సరస్వతి పాల్గొన్నారు.

‘అభ్యాసనమిత్ర’తో పాఠ్యాంశాలపై పట్టు



నర్వలో మెటీరియల్‌ను విడుదల చేస్తున్న నోడల్ అధికారి, హెచ్ఎంలు



మక్తల్‌లో మెటీరియల్‌ను విడుదల చేస్తున్న ఎంఈవో

నర్వ: సమగ్రశిక్ష, కలెక్టర్ కోయ శ్రీహర్ష సౌజన్యంతో చేపట్టిన వెలుగు అభ్యాసన మిత్ర సంసిద్ధ కార్యక్రమంతో విద్యార్థులు పాఠ్యాంశాలపై మరింత పట్టు సాధిస్తారని నోడల్ అధికారి రాజేశ్ కుమార్ అన్నారు. మరికల్‌లో సోమవారం అభ్యాసన పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యాసన కార్యక్రమం 45 రోజులపాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విజయవంతం చేయాలన్నారు. మారుమూల గ్రామాల్లో విద్యార్థులు ఆంగ్లం, తెలుగు, గణితం సబ్జెక్టులపై పట్టు సాధించేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు తిరుపతయ్య, రమేశ్‌గౌడ్, మల్లికార్జున్, సీఆర్పీలు నర్సింహులు, రోజా, సిబ్బంది రైసాభాను, రాంరెడ్డి పాల్గొన్నారు.

మక్తల్: స్థానిక ఎమ్మార్సీ భవనంలో వెలుగు అభ్యాసన మెటీరియల్‌ను ఎంఈఓ వెంకటయ్య విడుదల చేశారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేక చొరవతో విద్యాశాఖ ప్రాథమికస్థాయి విద్యార్థులు పలు సబ్జెక్టుల్లో పట్టు సాధించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్‌గౌడ్, విభూషన్, సీఆర్పీలు సునీత, పరిమళ, కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాస్, అల్తాఫ్ పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులను నమ్మొద్దు

నారాయణపేట రూరల్ : మహిళలు, బాలికలు అపరిచిత వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వసంత సూచించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో సోమవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు, బాలికల రక్షణకు షీ టీమ్స్ ఉంటాయనే విషయంపై అందరికీ అవగాహన ఉండాలని తెలిపారు. ఎవరైనా వేధింపులకు పాల్పడితే వెంటనే డయల్ 100, మహిళా హెల్ప్‌లైన్ నెంబర్ 8712670398ను సంప్రదించి ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ నేరాలను అరికట్టడానికి సెల్‌ఫోన్ వినియోగం తగ్గించాలని తెలిపారు. అమ్మాయిలతోపాటు మగపిల్లల్లోనూ మార్పు రావాలన్నారు. పోలీసు కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్‌లో ఉద్యోగ అవకాశాలు కోల్పోతారని హెచ్చరించారు.

రూరల్ ఎస్ఐగా జయప్రకాశ్

నారాయణపేట రూరల్ : నారాయణపేట రూరల్ ఎస్ఐగా జయప్రకాశ్‌ను నియమిస్తూ సోమవారం జోగుళాంబ జోన్ డీఐజీ చౌహాన్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లాకు నూతనంగా మంజూరైన రూరల్ పోలీస్‌స్టేషన్ వారంరోజుల్లో ప్రారంభం కానున్నది. అప్పక్‌పల్లి సమీపంలో భవన నిర్మాణ పనులు చేపడుతున్నారు. పనులు పూర్తయ్యే వరకు అద్దె భవనంలో పోలీస్‌స్టేషన్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం : కేసు నమోదు

మాగనూర్: మండలంలోని పెగడబండకు చెందిన తాయప్ప (42) అదృశ్యమైనట్లు ఎస్ఐ మల్లేశ్ తెలిపారు. రెండురోజుల కిందట ఇంటి నుంచి వెళ్లిన అతడు తిరిగి రాలేదని, కుటుంబసభ్యులు గాలించినా ఫలితం లేకపోయిందని పేర్కొన్నారు. తాయప్ప భార్య జిందమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



కొత్తపల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

- ప్రభుత్వ దవాఖానాల్లో మెరుగైన వైద్యం
- ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

మద్దూరు/కోస్గి: ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నదని ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అన్నారు. కోస్గి, మద్దూరు ఉమ్మడి మండలాల్లో సోమవారం పర్యటించి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. కోస్గి మున్సిపాలిటీ పదోవార్డు, మూడోవార్డు మల్‌రెడ్డిపల్లి, ఐదోవార్డు మాసాయిపల్లిలో రూ.10లక్షలతో సీసీరోడ్డు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. కోస్గి మార్కెట్‌యార్డులో రూ.94లక్షలతో షాపింగ్ కాంప్లెక్స్, ప్రహరీ నిర్మాణ పనులను ప్రారంభించారు. కొమ్మూరు, కొత్తపల్లి, పల్లెర్ల, పెదిరిపాడ్ గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించడంతోపాటు జాదరావుపల్లితండాలో రూ.20లక్షలతో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కొమ్మూరులో రూ.5లక్షలతో నిర్మించిన గురుమందిర్ షెడ్‌ను ప్రారంభించారు. అనంతరం కొత్తపల్లి ఎస్సీ కాలనీలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. కోస్గి దవాఖానలో రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ దవాఖానలను ఆధునీకరించి మెరుగైన వైద్యసేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. పల్లె, బస్తీ దవాఖానలు జిల్లాకో మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఒకవైపు రాష్ట్రాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేయడం, మరోవైపు అన్నివర్గాల అభ్యున్నతికి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందన్నా రు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీష, ఏఎంసీ చైర్మన్ వీరారెడ్డి, వైస్‌చైర్మన్ వరప్రసాద్, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ సలీం, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రామకృష్ణ, ఎంపీపీ మధుకర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ జగదీశ్వర్ పాల్గొన్నారు.

రేపు విద్యాసంస్థలు బంద్



మక్తల్‌లో విలేకర్లతో మాట్లాడుతున్న భాస్కర్

మక్తల్: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో 12న విద్యాసంస్థలు బంద్ చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్ అన్నారు. సోమవారం మండలంలోని ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. పాఠశాలలు తెరచి చాలా రోజులవుతున్న ఇప్పటివరకు విద్యార్థులకు యూనిఫాంలు, బుక్కులు, నోట్‌పుస్తకాలు పంపిణీ చేయలేదని ఆయన ఆరోపించారు. ఈ నెల 12న రాష్ట్ర పిలుపుమేరకు విద్యాసంస్థలు బంద్‌చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు అజయ్, సంధ్య, నయీం, సాకేత్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణపేట రూరల్ : విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 12న చేపట్టిన విద్యాసంస్థల బంద్‌కు అందరూ సహకరించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరహరి కోరారు. సోమవారం స్థానిక భగత్‌సింగ్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నదని, కార్పొరేట్ శక్తులను ప్రోత్సహిస్తూ పేద, మధ్యతరగతి చిన్నారులను చదువుకు దూరం చేస్తున్నదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పూర్తిస్థాయిలో అందించాలని, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియంబర్స్‌మెంట్ చెల్లించాలని, స్కావింజర్ల పోస్టులు భర్తీ చేయడంతోపాటుప్రైవేటులో అధిక ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వెంకటేశ్, రవి, కిరణ్, మహిపాల్, కృష్ణ, శశికిరణ్, పవన్ పాల్గొన్నారు.

పుస్తకపఠనం అలవర్చుకోవాలి



ఊట్కూర్: ప్రతిఒక్కరూ పుస్తకపఠనం అలవర్చుకోవాలని విశ్రాంత హెచ్ఎం అనంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని నిడుగుర్తి పాఠశాలలో సోమవారం నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొని మాట్లాడుతూ పురాణాలు, ఇతిహాసాలు, మహనీయుల జీవిత చరిత్ర భవితరాలకు మార్గదర్శనం చేసేందుకు పుస్తకాలు ఎంతో దోహదపడుతాయన్నారు. పుస్తకాలను మించిన మంచి మిత్రుడు ఎవరూ ఉండరని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు పద్మ, సునీత, వెంకటప్ప, ఆంజనేయులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ఉపాధి కల్పించాలి



ఎమ్మెల్సీ బండ ప్రకాశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు



కేక్‌కట్ చేస్తున్న ముదిరాజ్ సంఘం నేతలు

మక్తల్ : మత్స్యకారులకు మెరుగైన ఉపాధి కల్పించాలని మత్స్య సహకార సంఘం జిల్లా చైర్మన్ కోళ్ల వెంకటేశ్ కోరారు. సోమవారం హైదరాబాద్‌లో ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బండ ప్రకాశ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు సమస్యల పరిష్కారానికి కృషి కోరారు. కార్యక్రమంలో నాయకులు సరాఫ్ నాగరాజు, సింగిల్‌విండో చైర్మన్ ఈదప్ప, డైరెక్టర్లు నర్సింహులునాయుడు, భూత్పూర్ రిజర్వాయర్ మత్స్యకార సంఘం అధ్యక్షుడు ఆనంద్, శేఖర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా మత్స్య కారుల దినోత్సవం..

మక్తల్: మండలంలోని మత్స్యకారుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ముదిరాజ్ భవనం వద్ద పండుగసాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముదిరాజ్‌ల సమక్షంలో కేక్‌కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. ముదిరాజ్‌ల అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు నర్సింహులు, కిష్టప్ప, పృధ్వీరాజ్, తిరుపతి, కావాలి శ్రీహరి, కట్ట వెంకటేష్, హన్మంతు, ఆంజనేయులు, రమేష్, వాకిటి రమేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బేస్‌లైన్ టెస్ట్

నారాయణపేట రూరల్ : మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో సోమవారం విద్యార్థులకు బేస్‌లైన్ టెస్ట్ నిర్వహించారు. జాజాపూర్ పాఠశాలలో నిర్వహించిన పరీక్షను సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్, అంకురం ప్రతినిధి అంజద్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం కనకప్ప, డీఎస్ఓ భానుప్రకాశ్ పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి



మక్తల్‌లో రాస్తారోకో చేస్తున్న కార్మికులు

నారాయణపేట రూరల్ : మండల పరిషత్ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెకు కాంగ్రెస్, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథ నాయకులు మద్దతు తెలిపారు. కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాము, కాశీనాథ్, యాదగిరి, సుజేంద్రశెట్టి, బలరాం, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మక్తల్: పంచాయతీ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథ సబ్‌డివిజన్ కార్యదర్శి భగవంతు డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం కొనసాగింది. ఈ సందర్భంగా మక్తల్ ఎంపీడీఓ కార్యాలయం నుంచి కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించి ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య, అర్జున్ రాజ్, వెంకటేశ్, చంద్రశేఖర్, ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కిరణ్, రాంచంద్రి, నర్సింహ, నారాయణ పాల్గొన్నారు.

కృష్ణా: మండల పరిషత్ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగింది. ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు ఈశ్వర్, ఏజీ బుట్టో కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపారు.

ధన్వాడ: పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు సుజేంద్రశెట్టి అన్నారు. మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెకు కాంగ్రెస్ పార్టీ తరఫున మద్దుతు తెలిపారు. గ్రామాలను శుభ్రంగా ఉంచేందుకు నిరంతరం శ్రమించే కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉదయభాను, బాలకృష్ణ, తిరుమలమ్మ, పల్లవి, నర్సింహులు, బాలస్వామి, బాలయ్య, రాఘవేందర్, రఘు, రాజేశ్, మొగులయ్య, రాజూనాయక్ పాల్గొన్నారు.

మరికల్: పంచాయతీ కార్మికులపై ప్రభుత్వం వివక్ష చూపడం తగదని బీఎస్పీ నియోజకవర్గ ఇంచార్జి శ్రీనివాస్ అన్నారు. మరికల్ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టిన సమ్మెకు మద్దతు తెలిపారు. కార్మికులను రెగ్యులరైజ్ చేసి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే దశల వారీ పోరాటాలు చేస్తామన్నారు.

ఇథనాల్ కంపెనీని అడ్డుకుందాం

మరికల్: అందరికీ నష్టం చేకూర్చే ఇథనాల్ కంపెనీ ఏర్పాటును అడ్డుకుందామని సావిత్రీబాయి పూలే మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సరోజన పిలుపునిచ్చారు. మండలంలోని చిత్తనూర్‌లో ఇథనాల్ కంపెనీ ఏర్పాటుకు వ్యతిరేకంగా చేపట్టిన దీక్ష సోమవారం 10వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇథనాల్ ఉత్పత్తితో మద్యాన్ని పెంచి పోషించే కుట్ర చేస్తున్నట్లు తెలిపారు. దీని వల్ల యువత తాగుడుకు బానిసలుగా మారి కుటుంబాలు చిన్నాభిన్నంగా మారే అవకాశం ఉందన్నారు. ఇలాంటి ప్రమాదకరమైన కంపెనీలను గ్రామాల మధ్య ఉండకుండా ఉద్యమించాలని తెలిపారు.

కలెక్టర్‌కు వినతి అందజేత



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నారాయణపేట టౌన్ : బీసీ కులవృత్తిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష ఆర్థికసాయం అర్హులందరికీ అందేలా చూడాలని కోరుతూ సోమవారం జిల్లా నాయిబ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అశోక్ కుమార్, కార్యదర్శి గోపాల్ మాట్లాడుతూ కులవృత్తిదారులకు రూ.లక్ష ఆర్థికసాయం ప్రకటించడంతో వందలాదిమంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అర్హులైన ప్రతిఒక్కరూ ఆర్థికసాయం అందించడంతోపాటు నాయిబ్రాహ్మణులకు రూ.5లక్షల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రతి మండల కేంద్రంలో నాయిబ్రాహ్మణ కమ్యూనిటీ భవన నిర్మాణాలకు స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నర్సింహులు, వేణుగోపాల్, రవి, నాగరాజు, శివకుమార్, ఆనంద్, వెంకటేశ్, బీమ శంకర్, రవికుమార్ పాల్గొన్నారు.